క్లుప్తంగా

యువకుడి ప్రాణాలు కాపాడిన హెల్మెట్

దామెర : హెల్మెట్ ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. హనుమకొండకు చెందిన శ్రీనివాస్ ములుగులో ఫర్టిలైజర్ షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనంపై మంగళవారం ములుగు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. శ్రీనివాస్ సరిగ్గా లారీ ముందు పడిపోవడంతో వెంటనే అప్రమత్తమైన లారీ డ్రైవర్ ముందు టైరు తలపై నుంచి వెళ్లకుండా చాకచక్యంగా వ్యవహరించాడు. కాగా వెనక టైరు శ్రీనివాస్ తల మీద నుంచి వెళ్లడంతో హెల్మెట్ పగిలిపోయింది. కాగా తలకు మాత్రం గాయాలు కాలేదు. శ్రీనివాస్ కాళ్లకు, చేతులకు గాయాలు కావడంతో స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 వాహన సిబ్బంది ఇమ్రాన్, సాంబమూర్తి అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

భజన మండలి చేయూత



శాయంపేట : మండలంలోని గట్లకనపర్తి గ్రామానికి చెందిన బస్వోజు శ్రీనివాసచారి ఇంట్లో ఇటీవల అగ్ని ప్రమాదం చోటు చేసుకుని నష్టపోగా అతడికి భజన మండలి సభ్యులు మంగళవారం స్పందించి సాయం అందించారు. సూరంపేట సర్పంచ్ బొల్లెడ రజిత రఘుపతిరెడ్డి, రాంరెడ్డి రూ.8 వేలు, గట్లకనపర్తి భజన మండలి తరపున శ్రీశైలం, బుచ్చిబాబు రూ.5 వేలు, సీతారామ భజన బృందం తరపున లావణ్య రూ.2 వేలు అందజేశారు. హన్మకొండ జిల్లా శాఖ కార్యదర్శి అశోక్ కుమార్, భజన మండలి సభ్యులు సంతోష్‌కుమార్, బాబు, వాసుదేవమూర్తి, మరికొందరు సాయం అందించడానికి ముందుకొచ్చిన భజన మండలి బృందానికి జిల్లా అధ్యక్షుడు మందాటి రాజు, మండల కమిటీ సభ్యులు సదానందం, రాజు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ బొల్లేపల్లి కృష్ణ పత్రికలకు వెల్లడించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో తూటి నర్సింహారెడ్డి, కలకోటి యాదగిరి, పెసరు ఎల్లయ్య, నక్క ప్రవీణ్, వికాస్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, అప్పని సంపత్, గుండారపు రాజు, ముప్పారం సతీష్, సమ్మయ్య, అంకుస్, బోడ సాగర్, రఘు ఉన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాయంపేట : స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.సుభాషిణీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం 2022–23 విద్యాసంవత్సరంలో పదో తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 31 వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, మార్చి 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీడ్ డీలర్లపై చర్యలు తీసుకోవాలి

నడికూడ : నకిలీ సీడ్ అంటగట్టి తమను మోసగించిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని మండలంలోని కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన రైతులు కొంగంటి రాజన్న, ఆకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బాధిత రైతులు విలేకరుల ఎదుట మంగళవారం గోడు వెళ్లబోసుకున్నారు. డీలర్లు మోసపూరిత మాటలతో నకిలీ మొక్కజొన్న సీడ్ అంటగట్టారని తెలిపారు. మొక్కకు నాలుగు తల సంచులు వేయడంతో రైతులకు దిగుబడి రావడం లేదన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి : చైర్మన్

ఆత్మకూరు : కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆత్మకూరు పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వచ్చి ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు ఉప్పుల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా కంటివెలుగు



ధర్మసాగర్ : వివరాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



కమలాపూర్ : పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ సుధీర్



నడికూడ : పరీక్షలు చేస్తున్న ఆప్తల్మాలజిస్ట్

● స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రణాళికాయుతంగా అమలు చేస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. మండలంలోని జానకిపురం గ్రామంలోని కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి సేవలను పరిశీలించి మాట్లాడారు. ఏ ఒక్కరూ కంటి సమస్యలతో సతమతం కావొద్దన్నారు. పేదలు కార్యక్రమాన్ని వినియోగించుకుని వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వాళ్లకు అద్దాలిస్తారని, శస్త్రచికిత్స కూడా ఉచితంగా చేస్తారని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కంటివెలుగుపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులను, బీఆర్ఎస్ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, మండల వైద్యాధికారి గోపీనాథ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : కంటివెలుగు కార్యక్రమాన్ని గిన్నీస్ రికార్డు సాధించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని జెడ్పీ చైర్మన్ మారెపెల్లి సుధీర్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని కంటివెలుగు శిబిరాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి చైర్మన్ సుధీర్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. కంటివెలుగు నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. అర్హులు, అవసరమున్న ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి, జెడ్పీటీసీ లాండిగె కళ్యాణి, సర్పంచ్ కె.విజయ, ఎంపీడీఓ పల్లవి, ఎంపీఓ విమల, వైద్యాధికారి హర్షిణీప్రియ, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, రామస్వామి పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలోని కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ ఊర రవీందర్‌రావు సందర్శించి మాట్లాడారు. మంగళవారం 120 మందికి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందజేసినట్టు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ కంటిపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ బాలకృష్ణ, హెచ్ఈఓ డాక్టర్ సంపత్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎలిజబెత్, ఏఎన్ఎం విజయలక్ష్మీ, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా భక్త మార్కండేయ జయంతి



పరకాల : పూజ చేస్తున్న పద్మశాలీ నాయకులు



దామెరలో..



ధర్మసాగర్‌లో..

ఆత్మకూరు : పద్మశాలీ మార్కండేయ సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో భక్త మార్కండేయ జయంతి మంగళవారం నిర్వహించారు. వేద బ్రాహ్మణులు మంత్రోచ్చారణల నడుమ భక్త మార్కండేయునికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందా లింగయ్య హాజరు కాగా ఆయన్ను మండల అధ్యక్షులు, కుల పెద్దలు సన్మానించారు. అనంతరం భక్త మార్కండేయ శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి యాదగిరి, మండల అధ్యక్షుడు వెల్దే వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షులు మార్త రంజిత్, చిందం నరేందర్, పాపని రవీందర్, వెంగలదాసు వెంకటనర్సు, వడ్డెపెల్లి రవి, వడ్డెపెల్లి మార్ల కేదారి, వేణుగోపాల్, అలువాల రవి, ప్రసాద్, రవీందర్ పాల్గొన్నారు.

దామెర : పద్మశాలీ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో భక్త మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి దుబాసి అనిల్, కోశాధికారి గడ్డం సదానందం, ముల్క కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎక్కలదేవి రమేష్, మండల సభ్యులు ఎక్కలదేవి శ్రవణ్, గుండ శ్రీనివాస్, దుస్స మొగిలి, సారంగం, దాసి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం గ్రామ అధ్యక్షుడు ఇనుగాల మల్లేశం మాట్లాడారు. మార్కండేయ ఆలయ నిర్మాణానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, వలపదాసు వెంకట్రాజం, గుర్రపు లక్ష్మినారాయణ, శ్రీరాముల సత్యనారాయణ, గుర్రపు వినేష్, పూల శ్రీనివాస్, శ్రీరాముల విజయ్, కందగట్ల బక్కయ్య, గుర్రపు రంజిత్, ఇనుగాల రాజు, ఉషకోయల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని శివ మార్కండేయ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. అర్చకులు మార్త రాజ్‌కుమార్, చిందం కరుణాకర్, మామిడి సాయి మంత్రోచ్చారణల నడుమ మార్కండేయ స్వామికి పంచామృత అభిషేకాలు, వస్త్రం, హోమం నిర్వంహించారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. సర్పంచ్ కందగట్ల రవి, ఆలయ కమటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్, సొసైటీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, డైరెక్టర్లు ప్రభాకర్, దాసిర సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన



శాయంపేట : తమకు పూర్వీకుల నుంచి అందిన 150 ఎకరాల భూమిలో ఎస్సారెస్పీ కాలువ పక్కన సర్పంచ్ భర్త, మామ, మరొకరు నాలుగెకరాలు అక్రమంగా పట్టా చేసుకున్నారని తెలుపుతూ బాధిత సాదోనిపల్లి గ్రామ రైతులు మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. తమ భూమి తమకు ఇప్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. సర్పంచ్ భర్తపై, మామపై ఫిర్యాదు చేసినట్టు రైతులు తెలిపారు.

వాహనాల వేలంతో రూ.1.97 లక్షల ఆదాయం



పరకాల : పరకాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 26కుగాను 19 వాహనాలను వేలం వేయడం ద్వారా రూ.1,97,990 ఆదాయం వచ్చినట్టు ఆ శాఖ సీఐ జగన్నాథరావు తెలిపారు. వరంగల్ రూరల్ డీపీఈఓ లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షణలో మంగళవారం వాహనాలను వేలం నిర్వహించారు. మొత్తం 28 వాహనాలు ఉండగా వాటిలో 19 వాహనాలను వేలం వేశారు. కార్యక్రమంలో ఆ శాఖ ఎస్సై పద్మ, సిబ్బంది సమ్మయ్య, పి.సత్తయ్య, పి.రవీందర్, ఎస్.నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి



శాయంపేట : విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే కరాటే శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాధవి మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివి మెరుగైన ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు కార్యక్రమంలో బాలికా సాధికారత క్లబ్ కోఆర్డినేటర్ జి.చైతన్య, కరాటే మాస్టర్ జి.రజనీకాంత్, ఉపాధ్యాయినులు ఎం.శ్రావణి, ఇందిర, చైతన్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ

నయీంనగర్: రిపబ్లిక్ డే సందర్భంగా పట్టణంలోని 200 మంది పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తామని సాఫ్టెక్ కంప్యూటర్స్ డైరెక్టర్ దండె మధుమిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం మొదట వచ్చిన వారికి మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 92468 99300లో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు వినియోగించుకోవాలని కోరారు.

పేదలను ఆదుకోవడంలో విఫలం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి

భీమదేవరపల్లి : పేదలను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందని, వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని బడా సంస్థలకు రాయితీలుగా దోచిపెట్టిందని, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీలోనూ మోసపూరితంగా వ్యవహరించిందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరీ, నివేశనా స్థలాల పంపిణీ, తదితర అన్ని హామీలనూ తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. పేదలు గుడిసెలు వేసుకున్న ప్రభుత్వ స్థలాలను పట్టాలుగా ఇవ్వడంతోపాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవి, నాయకులు కొంగల రాంచంద్రారెడ్డి, మంచాల తిరుపతి, నందునూరి సదానందం, ఆదరి రమేష్, గొర్రె బాబు, టేకుమల్ల కుమారస్వామి, కూన యాదగిరి పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన కోసం శిక్షణ



బస్సును ప్రారంభిస్తున్న డీఎఫ్ఓ, డీడీఎం

ఐనవోలు : చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులపై మత్స్యకారులకు అవగాహన కల్పించడానికి శిక్షణా తరగతులకు పంపిస్తున్నట్టు మత్స్య శాఖ డీఎఫ్ఓ విజయభారతి తెలిపారు. మండలం నుంచి 25 మంది మత్స్యకారులను బస్సులో కాకినాడకు మంగళవారం బయల్దేరగా బస్సును నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్‌తో కలిసి జెండా ఊపి డీఎఫ్ఓ ప్రారంభించి మాట్లాడారు. నాబార్డ్, సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో కాకినాడలోని సెంటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరిస్ ఎడ్యుకేషన్‌కు మండలంలోని కొండపర్తి, కక్కిరాలపల్లి, సింగారం గ్రామాలకు చెందిన మత్సకారులను అవగాహన, శిక్షణా తరగతులకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ సంస్థ కార్యదర్శి ఎస్.విజయ్‌కుమార్, పిట్టల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణంలో వివాదం

● సామరస్యంతో నిలిచిన పనులు



ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న బీజేపీ నాయకులు, రాజిపేట కాలనీవాసులు

పరకాల : ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణంలో వివాదం చోటు చేసుకుంది. 9 నెలల క్రితం శివలింగం లభించిన ప్రదేశంలోనే ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణాన్ని మంగళవారం చేపట్టగా రాజిపేట కాలనీవాసులతోపాటు బీజేపీ శ్రేణులు అభ్యంతరం తెలిపారు. దీంతో నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలోనే ఖబరస్తాన్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ యాకూబ్ మతసామరస్యాన్ని చాటేలా వ్యవహరించారు. శివలింగం విషయమై పురావస్తు శాఖ నిర్ణయం మేరకు ప్రహరీ నిర్మాణ విషయమై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గొడవ సద్దుమణిగింది. ప్రహరీ నిర్మాణాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, నాయకులు దేవునూరి మేఘనాథ్, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, ఉపాధ్యక్షుడు నాగెల్లి రంజిత్, సీనియర్ నాయకులు మారెడుపల్లి భాస్కరచారి, ముత్యాల దేవేందర్, గిరిజన మోర్చా అధ్యక్షుడు పాలకుర్తి ప్రతాప్, ఓబీసీ అధ్యక్షుడు గోనెల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు పరామర్శ



ఐనవోలు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం పలువురు పరామర్శించారు. ఓరుగల్లు డీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి నాయక్, ఖిలా వరంగల్, రేగొండ, చౌటపల్లి, పర్వతగిరి, వర్ధన్నపేట సొసైటీ చైర్మన్లు కేడల జనార్ధన్, విద్యన్‌రావు, గొర్రె దేవేందర్, మనోజ్ గౌడ్, రాజేశ్ ఖన్నా, కార్పోరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, విక్టరీ అరుణ, మాజీ కార్పోరేటర్ శ్రీలేఖ, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్‌కుమార్ తదితరులు రవీందర్‌రావును వేర్వేరుగా పరామర్శించారు.

నిరుద్యోగులపై బీఆర్ఎస్ వివక్ష



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : నిరుద్యోగుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వివక్ష పాటిస్తోందని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాలులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన నిరుద్యోగ యువజన సదస్సుకు సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న హామీని సీఎం కేసీఆర్ విస్మరించారని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇవ్వగా బీఆర్ఎస్ పార్టీ ప్రజలను అనేక మోసపూరిత హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తదనంతరం విస్మరించిందని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు. నిరుద్యోగులకు ఉద్యోగం రావాలన్నా, యువత ఆత్మహత్యలు చోటు చేసుకోవద్దన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు చిందరం రవి, కృష్ణమూర్తి, రవీందర్, ఎంపీటీసీ గజ్జి ఐల్లయ్య, భాస్కర్, హైదర్, రఫీ, మార్కండేయ, రవిపాల్ పాల్గొన్నారు.

భాషా పండితులపై ప్రభుత్వ నిర్లక్ష్యం



ఆత్మకూరు : నిరసన తెలుపుతున్న టీచర్లు



నడికూడలో..

ఆత్మకూరు : భాషా పండితులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్రీయ పండిట్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జంజిరాల పూర్ణచంద్ర ప్రసాద్, హిందీ పండిట్ పి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెద్దాపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణచంద్ర ప్రసాద్, శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన పది వేలకుపైగా పండిట్ పోస్టులను బదిలీ షెడ్యూల్‌లో పండిట్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని వరికోల్ గ్రామంలోని జెడ్పీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో భాషా పండితుల జేఏసీ కార్యదర్శి కానుగుల భద్రయ్య, నాయకులు సేనాపతినాయక్, శివకుమార్, ప్రసాద్, రాజన్న, హరిసింగ్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలకు ప్రాధాన్యం



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, యూనియన్ నాయకులు

దామెర : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ కాగితాల శంకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పీఆర్టీయూ టీఎస్ 2023 క్యాలెండర్‌ను, డైరీని ఆయన మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. త్వరలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ చేపట్టనున్నట్లు తెలిపారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు చల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీల క్రమంలో సీనియారిటీ ప్రకారం న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి శరత్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాకాల సుధాకర్‌రెడ్డి, నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు భగవాన్‌రెడ్డి, రామ్మూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల అశోక్‌కుమార్, మండల అసోసియేట్ అధ్యక్షుడు రామశివారెడ్డి, మండల కార్యదర్శి ఎస్.రాజు, మహిళా ఉపాధ్యక్షురాలు విజయరాణి, ప్రభాసిని, సహనలత తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న నాగరాజు

ధర్మసాగర్ : క్రీడలతో శారీరక, మానసిక వికాసం జరుగుతుందని ఎంపీటీసీల ఫోరం మాజీ ఉమ్మడి మండల అధ్యక్షుడు తోట నాగరాజు తెలిపారు. మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో జెడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి స్ఫూర్తితో రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేలా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజేతలకు బహుమతులు అందించేందుకు నిర్వాహకులకు రూ.20 వేలు అందించారు. అలాగే ప్రైమరీ స్కూల్ విద్యా కమిటీ చైర్‌పర్సన్ బచ్చలకూరి శ్యామల భర్త రాజు స్మారకంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతల బహుమతుల కోసం మాజీ వార్డు సభ్యులు యాట నాగరాజు, జిట్ట కుమార్ రూ.10 వేలు అందచేశారు. కార్యక్రమంలో కరుణాపురం సర్పంచ్ కలకోటి అనిల్‌కుమార్, మాజీ ఎంపీపీ రాజారపు యాదగిరి, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కలకోటి సాంబయ్య, ఎస్ఎంసీ చైర్మన్ మామిడాల కిశోర్, బత్తిని రాజ్‌కుమార్, సోమ అమర్‌నాథ్, రాజారపు సురేష్, కడియం యువసేన అధ్యక్షుడు శేరి రాజేశ్వర్‌రెడ్డి, కుల సంఘాల అధ్యక్షులు బొల్లెడ్ల ప్రకాష్‌రెడ్డి, బత్తిని రవీందర్, నేరెళ్ల జనార్ధన్, పెంజర్ల రాజ్‌కుమార్, గోదల నాగరాజు, సొదరపల్లి భిక్షపతి, పుంద్రు రాజు, ప్రతాప్‌రెడ్డి, యాట సాంబరాజు, లింగారెడ్డి, మధుకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రవి, ప్రశాంత్, తిరుపతి, అనిల్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో భవిష్యత్‌కు నష్టం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

కమలాపూర్ : బాల్యవివాహాలతో బంగారు భవిష్యత్తుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని లర్నింగ్ కర్వ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ, కోఫౌండర్ సుబ్బు తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీలో ×బాల్యవివాహాలు వద్దు¥ అంశంపై మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో సుబ్బు మాట్లాడారు. చిన్న వయస్సులో వివాహం చేస్తే శారీరక, మానసిక సమస్యలు తప్పవని స్పష్టం చేశారు. బాలికలను బాగా చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. బాలికలు విద్యార్థి దశలోనే బాల్యవివాహాలు, ఇతర రుగ్మతలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతులు కావాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆత్మరక్షణ విద్యపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించేలా విద్యార్థినులతో గూడూరు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకతి సాంబయ్య, కేజీబీవీ ఎస్ఓ అర్చన, లర్నింగ్ కర్వ్ ప్రతినిధులు పరమేశ్వరం, గాయత్రి, స్వప్న, తులసి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

కమలాపూర్ : మండలంలోని ఉప్పులపల్లికి చెందిన కంది కనుకలక్ష్మి (65) ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై సతీష్ మంగళవారం తెలిపారు. అయన కథనం ప్రకారం.. కనుకలక్ష్మి ఈనెల 18న వంట చేసేందుకు ఇంటి ముందున్న కట్టెల పొయ్యి వెలిగించగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని గాయాలపాలైంది. ఆమెను కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి కొడుకు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.